

# గుడిలో దేవుడు

కె.వి.యస్. ప్రకాశరావు

లోపల కడుగు పెట్టబోతూ గుమ్మంలో చటుక్కున నిలబడి పోయాను. పరిచయమైన కంఠం విన్పిస్తోంది. చెల్లాయి పద్మతో మాట్లాడే ఆ కంఠాన్ని గుర్తించడానికి రెండు నిమిషాలు పట్టింది.

ఆ కంఠధ్వని నాకు సుమారు అయిదు సంవత్సరాల క్రితం చిరపరిచితం. ఆ మాట్లాడేది హెడ్ మాష్టారు ఆనందరావుగారు!

"నమస్కారం మాస్టారూ!" నమస్కరిస్తూ లోపలకు వెళ్ళాను. ఆయన నన్ను చూసి ఓ చిర్నవ్వు నవ్వి "కులాసాగా వున్నావా శంకరం?" అని అడిగారు.

"అదంతా మీ దయ మాస్టారూ" అన్నాను నిలబడి. ఆయనంటే నాకు భయం, భక్తి రెండూ వున్నాయి.

"కూచోవోయ్."

ఎదురుగావున్న కుర్చీలో కూచుంటూ "యిలా వచ్చారేమిటి మాస్టారూ" అని పద్మను చూస్తూ. "మాస్టారు కేమయినా యిచ్చావా?" అడిగాను.

"అతిథి సత్కారాలకే లోటూ మీ పద్మ చేయలేదు. యిచ్చట పనిమీద వచ్చాను. మీ రిక్కడే వుంటూన్నట్లు విని మీ యింటికి వచ్చాను" అంటూ తిరిగి "పదిహేను రోజుల్లో మా అబ్బాయి సుందరం వివాహం. గోవిందయ్య మాస్టారుతో చెప్తామని వచ్చాను. మాటల సందర్భంలో మీ కబుర్లు దొర్లాయి, చెల్లిలితో యిక్కడే వుంటున్నావని విని నీతో యీ కబురు చెప్పిపోదామని

వచ్చాను. రేపు వచ్చే 20వ తేదీన వివాహం. పెళ్ళికి మీరిరువురూ రెండు రోజులు ముందు రావాలి. యింకా శుభ లేఖలు వేయించలేదు. వాటికోసం ఎదురుచూడకుండా తప్పకుండా రావాలి" అన్నారు.

"అలాగే మాస్టారు" అన్నాను.

"యింకా నువు వివాహం చేసుకో లేదా?"

"ఆదేం ప్రశ్న మాస్టారూ. ముందు మా పద్మకు వివాహమవకుండా నేనెలా చేసుకుంటాను. నాన్నగారు చనిపోయి రెండు సంవత్సరాలయింది. అప్పటి నుండి చెల్లాయి బరువు బాధ్యతలు నామీద నున్నాయి. యీ ఏడాదితో చదువు పూర్తవుతుంది. నాన్నగారి కోరిక ననుసరించి, యీ పల్లెలో కాలేజీ లేక పోయినా, పద్మను హాస్టల్‌లో వుంచి పట్నంలో చదువుకి కుదిర్చాను. ఏదో దేముడి దయవలన డిగ్రీ పూర్తయితే పద్మకు తగిన వరున్ని చూసి యీ సంవత్సరం వివాహం చేద్దామనుకుంటు న్నాను. ఆ తర్వాతనే నా పెళ్ళి" అన్నాను.

"శుభం బాబూ! ఆ రోజులకీ యీ రోజులకీ నీలో చాలా మార్పువచ్చింది శంకరం. అది సరే యిక నేను వస్తాను. మీ రిద్దరూ తప్పకుండా రావాలి" అన్నారు మాస్టారు నిల్చుంటూ.

"యీ పూటకు మా యింట్లో మా ఆతిథ్యం స్వీకరించి వెళ్ళండి" అన్నాను.

"నీ అభిమానం నాకు తెల్సును శంకరం. చేయవలసిన పనులు చాలా వున్నాయ్ వస్తాను."

శంకరం మాస్టారు వెళ్తుంటే ఆయ నను చూస్తూ కూచుండిపోయాను. ఐదు సంవత్సరాల క్రితం సంఘటనలు మదిలో మెదలసాగాయ్. ఆ రోజులు మరువలేనివి!

అవి నేను స్కూల్ ఫైనల్ చదివే రోజులు. మా క్లాసులో సుమారు నల్భై మంది విద్యార్థీ విద్యార్థిను లున్నారు మా సెక్షన్‌లో విద్యార్థులంతా చదువు లోను, మార్కులు సంపాదించుకోవడం లోనూ ఫస్టని ప్రతీతి. కారణం పదవ తరగతిలోని విద్యార్థులంతా ఒకే సెక్ష న్‌లో వున్నాం.

నా గురించి నేను పొగడుకోవటం ఆత్మవంచనే. నిజం చెప్పాలంటే తొమ్మిదో తరగతిలో నేనే అన్నింటి లోను ఫస్టునవచ్చాను. ఆ కించిత్ గర్వం నేను స్కూల్ ఫైనల్‌లోకి రాగానే నాలో ప్రవేశించింది. అది నేను చాలా ఆల స్యంగా తెల్సుకున్నా.

మాకు హెడ్‌మాస్టర్ ఆనందరావు గారు ఇంగ్లీషు, సోషల్ స్టడీస్‌కు వచ్చే వారు. ఎవరయినా పాఠం వినక గోల చేసినా, మరితర అల్లరి చేసినా పేక

బెత్తంతో దండించేవారు. అటువంటి దండన మా సెక్షన్‌లో ఎవరికీ జరగ లేదనే చెప్పాలి.

నాలో చిన్న బలహీనత కూడా వుంది. అల్లరి చేష్టలతో యితరులను యిబ్బంది పెట్టడం. దాని వలన ఎదుటి వ్యక్తి ఎటువంటి మానసిక హింసలకు గురవుతారో నేను వూహించలేదు. నే నెటువంటి పరిస్థితుల నెదుర్కోవాలో కూడా ఆలోచించలేదు

ఆ రోజు... జీవితంలో మరచి పోలేనటువంటిది.

అరగంట ముందుగానే క్లాసురూంలో విద్యార్థులంతా కూచున్నాం. ముందు వరుసలో విద్యార్థినులు కూచున్నారు. ఎందుకో ఏనాడూ లేని చిలిపి ఆలోచనలు నాలో ప్రవేశించాయి.


"ఒరేయ్ విశ్వూ! మీ రెండు జడల బ్రె సుందరి ఏమంటోందిరా?" అన్నాను.

సుందరి అనే అమ్మాయి చటుక్కున లేచింది?

"అబ్బో! బుసలు కొట్టే సుందరి వాలుజడ నాగుపాములా ఎలా నాట్య మాడుతోందో చూడరా!"

నా మాటలకు మిగిలినవారు గొల్లున నవ్వారు. సుందరి మొహం వివర్ణంగా మారడం గమనించాను.

"అబ్బ చూడరా విశ్వూ! బుసలు కొట్టిన నాగు, తోకముడిచి మూగిలా




చూస్తోంది."

సుందరి కనులలో నీరే తరువాయి. యింతలో గంట మోగింది. క్లాసంతా నిశ్శబ్దంగా మారింది. అఖరుగా మరో అస్త్రాన్ని వదిలాను "ఆడవారితో ఆట లాడడం నాకు సరదా!"

ఐదు నిముషాలలో హెడ్ మాస్టారు క్లాస్ రూంలో ప్రవేశించి అటెండెన్స్ తీసుకున్నారు. అది పూర్తయిన తర్వాత పాఠం మొదలుపెట్టారు. రెండు నిము షాలు కూడా పూర్తవలేదు. సుందరి లేచి నిలబడింది.

"ఏం కావాలి?" అన్న హెడ్ మాస్టారి ప్రశ్నకు నాలో గాబరా జనించింది. సుందరి జరిగిన విషయాలు చెపితే—? వేయి దేముళ్ళకు మొక్కసాగాను.

సుందరి జరిగిన సంగతులు చెప్పింది.

మిగిలిన అమ్మాయిలు అవునన్నట్లు తలలూపారు.

"శంకరం!" హెడ్‌మాస్టారు గర్జించారు.

భయంగా నిలబడ్డాను.

"కమాన్. ముందుకి రా!"

తడబడే అడుగులతో హెడ్‌మాస్టారి ముందు నిలబడ్డాను. తలెత్తి ఆయనకేసి చూడలేకపోయాను. తప్పుచేసే ముందు ఆలోచన నశిస్తుంది. తప్పు చేస్తున్నామనే యింగితజ్ఞానం మనలో నశిస్తుంది ఏది తప్పు, ఒప్పనే భావన మనలో కలుగదు.

"ఏరా శంకరం- మీ చెల్లెలికి రెండు జడలు లేవా?"

జవాబు చెప్పడం నాలాంటి వారికి చేతకాదు.

"ఆడవారితో ఆటలాడడం నీకు సరదా! ఏరా! యింతవరకు నువ్వెంత మందితో ఆటలాడావో చెప్పరా. ఆడవారితో ఆటలాడేవరకూ నువ్వు వచ్చావంటే. నాకు చాలా సంతోషంగా వుందిరా. సెభాష్! యీ నాటికి నా క్లాసులో నీలాంటి ధైర్యంగల విద్యార్థి వుండడం నాకు ఆనందంగా వుంది."

మాస్టారి మాటలు వింటూంటే ఒంటిపై తేళ్ళు, పాములు పాకినట్లయింది. నేనెటువంటి శిక్షకు గురవుతానో! నన్ను స్కూల్‌నుండి డిస్‌మిస్ చేస్తే మా నాన్న కేమని చెప్పను.

"నిన్ను డిస్‌మిస్ చేసి స్కూల్ నుండి పంపిస్తే నీ భవిష్యత్ ఏమవుతుందో నీకు తెలుసునా! ఏమీ తెలియని వయసు నీది. కుర్ర చేష్టలతో తోటి విద్యార్థినులను అవమానంచేసి ఆనందం పొందితే నీకు కలిగే లాభం- ఆత్మతృప్తి. రేపు నీ చెల్లెలుని మరొకరు యిదే విధంగా అవమానం చేస్తే- ఆమె ఏం చేస్తుంది? విషయం నీకు చెబితే నువు కోపంతో బుసలు కొడతావు యిపుడు సుందరి అన్నగారు నీపై కక్షబూనితే ఏం చేస్తావ్! యివేమీ తెలియకుండానే ఏదో సాధిద్దామని అల్లరి చేసి నువ్విపుడు నలుగురిలోనూ అల్లరి పాలయ్యావు."

మాస్టారి మాటలకు నా తల అధః పాతాళానికి కృంగిపోసాగింది. మాస్టారు చెప్పిన మాటలు అక్షర లక్షలు.

"శంకరం. చెయ్యి చాపు", అన్నారు మాస్టారు.

కనులు మూసుకొని చేతిని చాపాను. మూడే దెబ్బలు పేకబెత్తంతో కొట్టారు.

"వెళ్ళు. వెళ్ళి బెంచీమీద యీ పూటంతా నిలబడు. నీకిదే యిప్పటి శిక్ష!"

మాట్లాడకుండా వెళ్ళి బెంచీమీద నిలబడ్డాను. మాస్టారి కంఠం కంచులా మోగింది.

"యిటువంటి పని నా కొడుకు చేస్తే నరికి పోగులు పెడతాను. యికపై యిటు

వంటి సంఘటనలు జరిగినట్లు వింటే ఏం చేయాలో నాకు తెల్సను. బుద్ధిగా చదువుకొని వృద్ధిలోకి రండి" అన్నారు మాస్టారు.

మాస్టారి మాటలు నా హృదయంలో సూటిగా నాటుకున్నాయి. ఆ రోజు నాలో ఏ మావహించి అటువంటి చర్యకు పాల్పడ్డానో నా వూహకందలేదు. ప్రతీ మగాడికి అక్క చెల్లెలుంటారు. యీ నగ్నసత్యం తెలుసుకున్న మగవాడు ఆడపిల్లను ఏడిపించడు। ఏడిపించలేడు॥

ఆనాటి నుండి నా ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. మాస్టారు నన్ను మెచ్చుకొని అభినందించారు.

నా చదువు పూర్తయి గ్రామం చేరాను. సంవత్సరాలు తిరుగుతుంటే మా నాన్న ఆరోగ్య పరిస్థితి క్షీణించ సాగింది. ఎన్నో వైద్యాలు చేయించాం. కాని...కాని...నాన్న అమ్మను చేరు కున్నాడు. నేను, పద్మ దిక్కులేని వార మయ్యాం.

పొలం పనులు చూసుకుంటూ పద్మను హాస్టల్‌లోవుంచి పట్నంలో చదివిస్తు న్నాను. పెద్ద సంబంధం చేయాలని నా వుబలాటం.

గతం నుండి వర్తమానంలోకి వచ్చాను.

"మాస్టారు ఏమంటారు పద్మా?" అడిగాను.

"వాళ్ళ సుందరం గురించి ఏవేవో చెప్పారు. నన్ను ఏవేవో అడిగారు. నువు స్కూల్లో చదివేరోజుల్లో సుంద రిని ఏడిపించడం గురించి కూడా చెప్పారు" నవ్వింది పద్మ.

నేను కూడా నవ్వుతూ "ఆనాడు ఎందుకో చిలిపి ఆలోచన వచ్చింది. మంచి గుణపాఠం నేర్చుకున్నాను. మాస్టారి యింటికి పెళ్ళికి వెళ్ళివచ్చిన తర్వాత నీ వివాహం గురించి ప్రయ త్నాలు చేయాలి" అన్నాను.

"వద్దన్నయ్యా। నేను వివాహం చేసుకోను".

పద్మ మాటలు వింటూనే నిర్ఘాంత పోయాను. "ఏమిటమ్మా నువు చెప్పేది?"

"అవునన్నయ్యా. నువ్వే ప్రయత్నా లేవీ చేయకు."

"కారణం?" సందేహంగా అడిగాను

"ఏమీ లేదు."

పద్మ జవాబు నాకు సంతృప్తి కలిగించలేదు. నాలో చిన్న అనుమానం చోటు చేసుకో సాగింది. అను మానం అనర్థాలకు హేతువు. సందేహ నివృత్తి చేసుకోవడం అన్ని విధాల వుత్తమం.

"కాదమ్మా. నువ్వేదో దాస్తున్నావ్? దాపరికం లేకుండా నీ మనసులో మాట చెప్పు." అన్నాను లాలనగా.

పద్మ మాట్లాడలేదు.

"చూడమ్మా। మన మంచిచెడ్డలు చూసేవారు ఎవరూ లేరు. కష్టసుఖాలు

మన మిరువురం ఒకళ్ళ కొకళ్ళం చెప్పుకొని సమస్యలకు పరిష్కారం చూసుకోవాలి. గుండెల్లో బాధలను దిగమింగుకుంటే మనిషి అధఃపాతాళానికి కృంగిపోతాడు. నీ మనసు విప్పి మర్మం లేకుండా చెప్పు తల్లీ! నాకున్న తోడు నీడ నీవే కదా."

పద్మ బావురుమంటూ "అన్నయ్యా!" అంటూ నన్ను కౌగిలించుకొని వెక్కి-వెక్కి ఏడ్వసాగింది.

"అమ్మా-పద్మా! ఏమిటమ్మా యిది? ఏం జరిగింది? విషయం చెప్పమ్మా?" ఆందోళనగా అడిగాను.

"ఎలా చెప్పమంటావు అన్నయ్యా! చెప్పలేను."

"పర్వాలేదు చెప్పమ్మా! నిన్నేమీ అనను. సరేనా!" అభయం యిస్తూ అన్నాను.

"అన్నయ్యా! మరి...మరేమో..."

"చెప్పమ్మా!"

"నేను... నేను!.. మూర్తి..." అంటూ పద్మ ఆగగానే సంగతి పూర్తిగా గ్రహించాను.

"ఎవరమ్మా ఆ మూర్తి? మీ రిద్దరూ ప్రేమించుకున్నారా! పెళ్ళి చేసుకుందా మనుకున్నారా?" నొసలు చిట్లిస్తూ అడిగాను. యవ్వనంలో వున్న యువతీ యువకులు ప్రేమించుకోవడం- పెళ్ళి చేసుకోవాలనుకోవడం యీనాడు పరిపాటయింది. ఆ తర్వాత యిరువురూ యవ్వనోద్రేకంలో... నా ఆలోచనలకు నాకే కంగారు పుట్టింది. పద్మ ఏమయినా- భగవాన్! ఆ పరిస్థితి రానీయకు!

"అవునన్నయ్యా! ప్రేమించుకున్నాం. ఒకరి మనసు మరొకరు తెల్సుకున్నాం. హృదయాలు విప్పి మాట్లాడుకున్నాం. కాని- అన్నయ్యా- మూర్తి... నన్ను పెళ్ళిచేసుకోనన్నాడు."

గంభీరంగా కాసేపు వుండిపోయాను. ఆలోచనలు చేయడం నాకిక యిష్టంలేదు.

"పద్మా! చూడు తల్లీ! ప్రేమించుకున్నారు. అంతేనా- లేక-?" సందేహిస్తూ అడిగాను. పద్మ నోటమ్మట ఏం మాటలు వినాలో అనే భయం పీడించసాగింది.

"లేదన్నయ్యా. అంత ధైర్యం చేయలేదు. నేను కాలు జారలేదు." అన్న పద్మ మాటలు వినగానే తృప్తిగా వూపిరి నిండుగా గాలి పీల్చుకున్నాను.

"ఎవరా మూర్తి? ఎవరబ్బాయి? నిన్నెందుకు వివాహం చేసుకోనన్నాడు?" అడిగాను.

"నన్ను క్షమించన్నయ్యా. ఆ వివరాలేమి నాకు తెలియవు. వాళ్ళ నాన్నగారు మరో సంబంధం చూసారట. అందుకు చేసుకోనన్నాడు. అంతకన్నా వివరాలు తెలియవు."

"మూర్తెవరో తెలియకుండా ప్రేమించావా?"

"అతను మా క్లాసే చదువుతున్నాడు

వాళ్ళ నాన్నగారి పేరు నాకు తెలియదు."

ప్రతీ ఆడపిల్ల చేసే తప్పు యిదే! వివరాలేమీ తెలియకుండా ప్రేమించడం-ఆ తర్వాత విలపించడం! నా పద్మకా పరిస్థితి రానీయకూడదు. మూర్తి ఎవరో తెలుసుకోవాలి. పద్మకు ఆనందం కలుగ చేయడం నా కర్తవ్యం.

మూర్తి గురించి తెలుసుకోడాని కొకటే మార్గం కన్పించింది స్కూలుకి వెళ్ళి మాస్టార్ల ద్వారా మూర్తి తండ్రి పేరు తెలుసుకోవాలి. మర్నాడు చేయ వలసిన ముఖ్యమైన పని యిదే!

"నీవు మరేం భయపడకు పద్మా! అన్ని విషయాలు నేను చక్క-బరుస్తాను." అన్నాను.

మర్నాటి ఉదయం లేవగానే నాకు కబురు వచ్చింది. నా స్నేహితుడొకడు ప్రాణాపాయ పరిస్థితిలో వున్నాడని. ముందుగా అక్కడకు వెళ్ళి రావాలి. తప్పదు!

ఆ తర్వాత మరితర ముఖ్యమైన పనుల వలన మూర్తి గురించి వాకబు చేయలేకపోయాను. ఓరోజు ఆనందరావు మాస్టారు నుంచి వుత్తరం వచ్చింది. శుభలేఖలు యింకా వేయించలేదని- మా యిద్దర్నీ 18వ తారీఖుకే తప్పకుండా రావాలని! పద్మను తీసుకొని వివాహా నికి బయలుదేరాను. పనిలో పనిగా పట్నంలోని మూర్తి విషయం కూడా చూడవచ్చును. మా యిద్దర్నీ చూడగానే మాస్టారు చాలా సంతోషించారు. మా యిరువురుకూ ప్రత్యేకంగా ఓ గది ఏర్పాటు చేసారు- నేను వద్దని చెప్తున్నా వినకుండా.

మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత మాస్టారు మా గదిలోకి వచ్చి కూచున్నారు. మా యిరువురునూ చూస్తూ "మీకు శుభలేఖలు యింకా యివ్వ లేదు కదూ! యిదిగో!" అంటూ శుభలేఖ నా చేతిలో పెట్టారు.

శుభలేఖ తెరిచి చదువుతూ నిర్ఘాంత పోయాను. నేను చూస్తున్నది కలా! ఏమిటిది!

"మాస్టారూ?"

"ఏమిటోయ్ శంకరం నీ గాబరా! శుభలేఖ చూడగానే కంగారుపడతావేం. నీ కర్థం కాలేదా!" అన్నారు ఆనంద రావు మాస్టారు. తిరిగి "సరే నేను చెపు తాను విను. నా కుమారుడయిన సుందరంకు నీ చెల్లెలు పద్మను యిచ్చి వివాహం చేయడానికి పెద్దలు నిర్ణయిం చారు." అన్నారు

"మీరు ఓ నిర్ణయం చేసేముందు మా అంగీకారం అవసరం లేదా?" అడిగాను

"తప్పకుండా కావాలి శంకరం. కాని యిప్పుడు నీ అంగీకారం తీసుకోవలసిన అవసరం నాకు లేదు."

"కారణం?" అడిగాను. ఎంతగా మాస్టారుని నేను భయభక్తులతో గౌరవిం చినా- నా యిష్టం లేకుండా పద్మను వారి

కోడలుగా చేసుకుంటారా!

మాస్టారు నవ్వారు. ఆ నవ్వును నేనే విధంగా తీసుకోవాలో అర్థంకాలేదు. ఆనాడు స్కూల్లో పదిమంది విద్యార్థుల ముందు నన్ను దండించినపుడు బాధపడలేదు. కాని యీనాడు నాకు తెలియకుండా మాస్టారు తీసుకున్న నిర్ణయం హర్షించలేకపోయాను.

"మా సుందరం చేసిన తప్పును సరిదిద్దాలంటే పద్మ యీ యింటి కోడలు కావాలి." అన్నారు.

"సుందరం చేసిన తప్పుకు- పద్మకు సంబంధం?"

నా ప్రశ్నకు మాస్టారు అదోలా చూసి "నీ కర్థం కాదు" అంటూ లోపలకు చూస్తూ "ఒరేయ్ సుందరం యిలా రారా!" అన్నారు.

కొన్ని నిమిషాలలో సుందరం తలొంచుకొని మా ముందు నిలబడ్డాడు. నేను సుందరాన్నే చూస్తుండడంచే గదిలో మరేం జరిగేది గమనించలేదు.

"సుందరం. చెప్పరా?" అన్నారు మాస్టారు.

కాని అతను నోరువిప్పి జవాబు చెప్పలేదు. నేను చూడడం మినహా మరేం చేయటంలేదు.


"శంకరం!! నేను చెప్తాను విను. సుందరం ఏమీ చెప్పడు. చెప్పలేని మూర్ఖుడు మీ పద్మ-మూర్తి ప్రేమించుకున్నారు. అవునా," అడిగారు మాస్టారు.

యీ విషయం మాస్టారు కెలా తెల్సిందో నా కర్థంకాలేదు. నా వూహ ప్రకారం వారిరువురి ప్రేమ సంగతి సుందరంకు తెల్సి వుండాలి. అతనే మాస్టారుతో చెప్పివుండాలి. అయినపుడు పద్మను సుందరానిచ్చి మాస్టారు వివాహం చేయటానడానికి కారణం? మోసపోయిన పద్మను- అభిమానంగా తన కోడలుగా స్వీకరిద్దామనా!

"శంకరం!" మాస్టారు గంభీరంగా అన్నారు. "సుందరం మరెవరో కాదు. నీ పద్మ ప్రేమించిన మూర్తే- సుందర మూర్తి!"

నిశ్చేష్టుడనయ్యాను!

"అవును శంకరం! ఆనాడు మీవూరు వచ్చాము. మాటల సందర్భంలో గోవిందయ్య మాస్టారు మా సుందరం, మీ పద్మ పట్నంలో ప్రేమించుకుంటూ తిరుగుతూన్న సంగతి చెప్పాడు. మా సుపుత్రుడు చేసిన నిర్వాకానికి సిగ్గుపడ్డాను. ప్రేమించిన పడతిని వివాహం చేసుకుంటానని ధైర్యంగా చెప్పలేని సుందరం నా దృష్టిలో దోషిగా నిలబడ్డాడు. కన్నెపిల్ల జీవితంతో ఆటలాడుకునే కామాంధుడిగా కన్పించాడు. అందుకే ఆనాడే- పద్మను నా కోడలుగా చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. మీకు చెప్పకుండా ఆశ్చర్యం కలిగిద్దామని ఈ విధంగా చేసాను. ఆనాడు నీవు సుందరిని వేళాకోళం చేస్తే దండించాను. యీనాడు నా కొడుకు చేసిన పని- ప్రవర్తించిన తీరుకి ఏ విధంగా శిక్షించాలి, సరికి పోగులు పెట్టాలి. కాని వాడిని అభిమా



నంగా ప్రేమించిన యువతి గతి? యింటికి వచ్చి సుందరాన్ని నిలదీసి అడిగాను. చేసిన తప్పు ఒప్పుకున్నాడు. వివాహం కాక పూర్వం యీ విషయం నాకు తెల్పినందుకు సంతోషించాను. లేకపోతే ఆనాడు నిన్ను శిక్షించి యీనాడు నా కొడుకుని వదిలితే నిన్నెలా చూడగలను. ఒక యువతి జీవితం కన్నీటిపాలు కాకూడదని వియ్యాలవారితో విషయాలు చెప్పి మన్నించమని కోరాను. నా సహృదయానికి వారు హర్షించారు. శంకరం నీ కింకా పైముంది. నీకు కావలసిన బంధువులకు టెలిగ్రాంలు యివ్వు. మా సుందరం చేసిన పనికి క్షమించు."

మాస్టారుకేసి కనురెప్పలు మూయకుండా చూస్తుండిపోయాను. నిజంగా మాస్టారు దేవుడు. వేయిమంది బంధువుల పెన్నిధి. మా పాలిట కల్పతరువు. వెదకనవసరం లేకుండా మాకు అదృష్టాన్నిచ్చిన వసుదేనువు. గుడిలో దేవుడిని అర్థిస్తే వరాలిస్తాడు.

మాస్టారున్న యీ యిల్లనే గుడిలో మా పద్మ ఆయనను దేవుడిలా కొలిచి, కోరుకున్న భర్త ఆలనాపాలనలో సుఖంగా నిండుగా నూరేళ్ళు జీవిస్తుందని నా నమ్మకం.

*